ప్రజా సంక్షేమమే ప్రథమ లక్ష్యం



పనుల శంకుస్థాపనలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

బండ్లగూడ: ప్రజా సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ పేర్కొన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో గురువారం రూ.4.23 కోట్లతో వివిధ అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. రూ.కోట్లు వెచ్చించి ప్రజలకు మెరుగైన వసతులు కల్పిస్తున్నామన్నారు. అభివృద్ధి పనులకు ప్రజలంతా సహకరించాలని కోరారు. ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు నిరంతరం కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ శరత్‌చంద్ర, మాజీ మేయర్ మహేందర్‌గౌడ్, నాయకులు గోకరి సురేష్‌గౌడ్, కృష్ణారెడ్డి, మలాకీ రత్నం, పాపయ్య యాదవ్, హరీష్‌గౌడ్, ఖాజాపాషా, సుమన్‌గౌడ్ పాల్గొన్నారు.

రాజేంద్రనగర్‌కు ఉప ఎన్నిక తప్పదు

ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

మణికొండ: రాజేంద్రనగర్ నియోజకవర్గానికి శాసనసభ ఉప ఎన్నిక తప్పదని, రాబోయే రోజుల్లో వచ్చే మున్సిపల్ ఎన్నికలకు ప్రతి నాయకుడు, కార్యకర్త సిద్ధంగా ఉండాలని మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడిగా నియామకమైన మంచిరేవుల గ్రామానికి చెందిన కె. విష్ణువర్ధన్‌రెడ్డికి గురువారం ఆమె నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ నియోజకవర్గం చెందాల్సినంత అభివృద్ధి చెందలేక పోతుందన్నారు. మెట్రో ప్రాజెక్ట్‌తో రూపురేఖలు మారిపోయే అవకాశం ఉండగా దాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయటంతో అభివృద్ధి 20 సంవత్సరాలు వెనక్కి వెళ్లిందన్నారు. రాబోయే రోజుల్లో బీఆర్‌ఎస్ పార్టీదే అధికారమని, అప్పుడు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపుతామన్నారు. నార్సింగి మున్సిపాలిటీలో మరికొంత మంది నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.



విష్ణువర్ధన్‌రెడ్డికి నియామకపత్రం ఇస్తున్న సబితారెడ్డి

సమస్యల పరిష్కారానికి కృషి



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించిన నాయకులు

మణికొండ: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని బీఆర్‌ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ కార్య నిర్వాహక అధ్యక్షుడు ధన్‌రాజ్, ఉపాధ్యక్షుడు ఉపేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని వేంకటేశ్వర కాలనీ, బాపుహిల్స్, వైఎస్సార్ కాలనీలల్లో లో వోల్టేజీ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను విద్యుత్ శాఖ దృష్టికి తీసుకెళ్లి అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరారు. దిమ్మెను నిర్మించాలని సూచించడంతో వారు సొంత డబ్బుతో నిర్మించటంతో గురువారం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. తమ విద్యుత్ సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఇరువురికి ఆయా కాలనీల వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

పార్ట్‌టైమ్ పీహెచ్‌డీ దరఖాస్తులకు గడువు పొడిగింపు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో పార్ట్‌టైమ్ పీహెచ్‌డీ కోర్సులకు దరఖాస్తు చివరి తేదీని పొడిగించినట్లు 'మనూ' అడ్మిషన్ల డైరెక్టరేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం వనజ గురువారం తెలిపారు. 'మనూ'లో స్పాన్సర్డ్/సెల్ఫ్ ఫైనాన్సింగ్ మోడ్‌లో పార్ట్‌టైమ్ పీహెచ్‌డీ కోర్సులలో అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుల ను ఈ నెల 24వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు.

'శ్రీమతి కథల సంపుటి' పుస్తకావిష్కరణ



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని తెలుగు విభాగం ఆధ్వర్యంలో 'శ్రీమతి కథల సంపుటి' పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రముఖ రచయిత దొండపాటి కృష్ణ రచించిన ఈ పుస్తకాన్ని తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య పిల్లల మర్రిరాములు గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలుగు శాఖ పూర్వ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, డాక్టర్ భూక్యాతిరుపతి, విల్సన్‌రావు కొమ్మవరపు పాల్గొన్నారు.

శంషాబాద్ మున్సిపాలిటీ ఓటర్లు @ 58,179

- విలీన గ్రామాలతో పెరిగిన పదివేలకుపైగా ఓట్లు
- ప్రస్తుతం ఉన్న 25 వార్డుల సంఖ్యలోనే మొత్తం ఓటర్ల విభజన ప్రక్రియ



శంషాబాద్: విలీన గ్రామాలతో విస్తరించిన శంషాబాద్ మున్సిపాలిటీ ఓటర్ల సంఖ్యను అధికారులు తేల్చారు. గత వారం రోజులుగా పురపాలక శాఖ మౌఖిక ఆదేశాల మేరకు మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాలతో కలిపి వార్డుల విభజన ప్రక్రియ చేపడుతున్నారు. గ్రామాలను విలీనం చేసినప్పటికీ వార్డుల సంఖ్యను పెంచకుండానే ఒక్కో వార్డుకు కనిష్ఠంగా 2200 ఓటర్లు, గరిష్ఠంగా 2400 ఓటర్లు ఉండేలా చూసుకుని కొత్త 25 వార్డులకు తుదిరూపునిస్తున్నారు. ఇందులో భాగంగా పట్టణ ఓటర్ల సంఖ్య మొత్తం 58179 ఉన్నట్లు తేల్చారు. పురుషులు 29425, మహిళలు 28751, ఇతరులు 3 ఉన్నారు. ఇది గత మున్సిపాలిటీ ఓటర్ల సంఖ్యకు పదివేలకు పైగా ఉంది. విలీన గ్రామాలతో జీహెచ్ఎంసీని ఆనుకుని ఉన్న మున్సిపాలిటీలను అందులో విలీనం చేసే ప్రక్రియలో భాగంగా ఆయా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు సమీపంలో ఉన్న గ్రామాలను విలీనం చేశారు.

విలీన గ్రామాల ఓటర్లతో వార్డులు ఖరారు

శంషాబాద్ మున్సిపాలిటీలో గతంలో ఆరు గ్రామాలతో పాటు తాజాగా పదిహేను రోజుల కిందట శంకరాపురం గ్రామాన్ని కూడా మున్సిపాలిటీలో విలీనం చేశారు. తాజాగా జరిగిన గ్రామం విలీన ప్రక్రియ పూర్తయిన వెంటనే పురపాలక శాఖ ఆదేశాల మేరకు గతంలో ఉన్న 25 వార్డుల సంఖ్యకు అనుగుణంగానే విలీన గ్రామాల ఓటర్లను కలుపుని వార్డులను ఖరారు చేశారు. ప్రస్తుతం మున్సిపాలిటీ అధికారులు చేపడుతున్న ఈ ప్రక్రియ త్వరలో మున్సిపాలిటీ ఎన్నికలు వస్తాయా.? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నప్పటికి దానిపై అధికారికంగా ఎలాంటి స్పష్టత లేదనేది సమాచారం. ఒక వేళ జరిగితే అందుకు సిద్ధంగా ఉండాలనే సమాచారం మేరకు మాత్రమే అధికారులు ఈ ప్రక్రియను చేపడుతున్నారు. జీహెచ్ఎంసీలో కనుక విలీనమైనా ప్రస్తుతం ఉన్న ఓటర్ల సంఖ్యతో కేవలం రెండు వార్డులకు మించే అవకాశం లేదు.

త్వరలోనే స్పష్టత..

మున్సిపాలిటీలు జీహెచ్ఎంసీలో విలీన ప్రక్రియపైనే ప్రభుత్వం బలంగా మొగ్గు చూపుతుందనే వాదనలే ఎక్కువగా ఉన్నాయి. మరో వైపు ఒకదఫా మాత్రమే మున్సిపాలిటీగా ఉన్న వాటిని మరోసారి మున్సిపాలిటీలుగా ఉంచాలని ప్రజాప్రతినిధుల నుంచి ఉన్న డిమాండ్ మేరకు మున్సిపాలిటీలుగా కొనసాగవచ్చనే వాదనలు కూడా ఉన్నాయి. మరో వైపు అధికారులు ఉన్నతాధికారుల మౌఖిక ఆదేశాల మేరకు ప్రస్తుతం చేపడుతున్న ప్రక్రియ కూడా దేనికి సంకేతం అన్నది కూడా స్పష్టత లేకపోవడంతో అయోమయం నెలకొంది. మరికొన్ని రోజుల్లో జీహెచ్ఎంసీ విలీనమా..? మున్సిపాలిటీనా అన్నది స్పష్టమయ్యే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు



మణికొండ: వేగంగా దూసుకొచ్చిన ట్రావెల్స్ బస్సు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. అజీజ్‌నగర్ నుంచి లంగర్‌హౌస్‌కు ద్విచక్రవాహనంపై వెళ్తున్న బి.రాజు యాదవ్‌ను వేగంగా నిర్లక్ష్యంగా వచ్చిన ప్రైవేటు బస్సు ఢీకొట్టడంతో కిందపడి గాయపడ్డాడు. బస్సు ఆపకుండా టిప్పుఖాన్ పూల్ వద్ద ఓ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి ఆగిపోయింది. డ్రైవర్ రాజును స్థానికులు పట్టుకుని పోలీసులకు సమాచారం ఇవ్వగా మద్యం తాగినట్లు గుర్తించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రొఫెసర్ శ్యామన్నకు అరుదైన అవకాశం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ సీనియర్ ప్రొఫెసర్ బీఆర్ శ్యామన్నకు అరుదైన అవకాశం లభించింది. శ్యామన్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ (ఎన్ఐహెచ్ఎఫ్‌డబ్ల్యూ) గవర్నింగ్ బోర్డు సభ్యుడిగా నియమితులయ్యారు. కేంద్ర ఆరోగ్య, కుటుంబసంక్షేమ శాఖా మంత్రి జగత్‌ప్రకాశ్‌నడ్డా ఈయనను నియమించారు. న్యూఢిల్లీలో జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

ఎన్‌ఆర్‌ఈజీఎస్‌పై సెమినార్

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని జాతీయ గ్రామీణాభివృద్ధి పంచాయతీ రాజ్ (ఎన్ఐఆర్‌డీపీఆర్)సంస్థలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ అమలు, ఇందులో ఉన్న సవాళ్లు, చేర్చాల్సిన పనుల గురించి రెండ్రోజుల సెమినార్ ఏర్పాటు చేశారు. దేశంలోని పలు ప్రాంతాల ఉపాధి హామీ రీసర్చ్ ఫెలో పాల్గొన్నారు. జీవనోపాధి అభ్యాసకులు, వాతావరణ స్థితిస్థాపకల, డిజిటల్ పాలన నైపుణ్యాభివృద్ధి, లింగ సమానత్వం, ఎస్‌డీజీలపై సీనియర్ రీసెర్చ్ ఫెలో డాక్టర్ సుధా నారాయణన్ మాట్లాడారు. గతం, వర్తమానం, భవిష్యత్‌లో జాతీయ ఉపాధి హామీ పథకం(ఎన్‌ఆర్‌ఈజీఎస్) పని తీరుపై చర్చించారు.అనంతరం ఉపాధి హామీ పథకం సవాళ్లపై రాసిన పుస్తకాని విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ రవీంద్ర, ఎస్ గవలి, డాక్టర్ ధీరజ్, డాక్టర్ సోనల్ మోబర్ రాయ్, డాక్టర్ సీ ధీరజ్ ,డాక్టర్ దిగంబర్ ఎ చిమాన్కర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

తడిపొడి చెత్తపై అవగాహన

రాయదుర్గం: తడిపొడి చెత్తపై మధురానగర్‌లో జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్‌లో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానికంగా ఉన్న ప్రైవేటు వసతిగృహాలు, వ్యాపార వాణిజ్య సముదాయాలు, దుకాణాలలో తడిపొడి చెత్తను వేరు చేసి జీహెచ్ఎంసీ ద్వారా చెత్త సేకరించే రిక్షా వారికి ఇవ్వాలని, మురుగుకాలువల్లో ఖాళీ స్థలాల్లో చెత్త పారబోయరాదని శానిటేషన్ ఉద్యోగులు సూచించారు. కార్యక్రమంలో కాలనీవాసులు రమేష్‌గౌడ్ శ్రీనివాస్, లడ్డూ, ఎస్ఆర్‌పి కిష్టప్ప, ఫీల్డ్ అసిస్టెంట్ అనీల్‌కుమార్, తిమ్మప్ప, సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న శానిటేషన్ ఉద్యోగులు

బీసీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- బీసీ కమిషన్ ఛైర్మన్ జి.నిరంజన్
- కార్వాన్ నియోజకవర్గంలో కులగణన సర్వే పరిశీలన

గోల్కొండ: బీసీల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ జి.నిరంజన్ అన్నారు. గురువారం ఆయన కార్వాన్ నియోజకవర్గంలో ఇంటింటికి తిరిగి కులగణన సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఉప్పర్‌బస్తీ, ఆర్యసమాజ్, టోలి మసీదు, బాంజావాడి తదితర ప్రాంతాల్లో ప్రతి ఇంటికి వెళ్లి వివరాలను అడిగి నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల గణనపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధృడ సంకల్పంతో ఉన్నారన్నారు. సంవత్సర కాలం నుంచి బడ్జెట్‌లో బీసీ సంక్షేమానికి వేల కోట్ల రూపాయలు మంజూరయ్యాయని తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులు రాకముందే పూర్తయిన కులగణన సర్వేను మళ్లీ చేయించడం ఆయన ధృడచిత్తానికి నిదర్శనమని అన్నారు. కులగణన పూర్తి చేయడం కోసం ముఖ్యమంత్రి ఎన్నికలను సైతం వాయిదా వేశారని పేర్కొన్నారు.



కుల గణనలో భాగంగా వివరాలు సేకరిస్తున్న బీసీ కమిషన్ ఛైర్మన్ జి.నిరంజన్

బీసీలపై కాంగ్రెస్‌కు ఉన్న నిబద్ధత మరే పార్టీకి లేదు..

బీసీలపై కాంగ్రెస్‌కు ఉన్న నిబద్ధత మరే పార్టీకి లేదని ఆయన అన్నారు. సెక్యూలర్ పార్టీ అయిన కాంగ్రెస్‌కు ప్రజా సంక్షేమం బాగా తెలుసన్నారు. ఈ సందర్భంగా పలువురు వృద్ధులు, వికలాంగులను ఆయన కలిశారు. ప్రభుత్వం నుంచి మీకు ఆసరా ఫించన్‌లు వస్తున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు కురాకుల కృష్ణ, వినోద్‌సింగ్, జి.కిషన్, ప్రేమ్‌కిషోర్, వనజ, షకీలా, హేమలత తదితరులున్నారు.

హిందూ శ్మశానవాటికలు కబ్జాకాకుండా చూస్తాం



శ్మశానవాటికను పరిశీలిస్తున్న తహసీల్దార్ ప్రవీణ్ కుమార్

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలోని అరుంధతికాలనీ, కృష్ణారెడ్డినగర్‌లలోని హిందూ శ్మశానవాటికలు కబ్జాకు గురయ్యాయని బీజేపీ నాయకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బండ్లగూడ మండల తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా బీజేపీ డివిజన్ అధ్యక్షుడు సాయి ప్రసాద్ కబ్జాకు గురైన స్థలాన్ని తహసీల్దార్‌కు దగ్గరుండి చూపించారు. ప్రభుత్వ స్థలాలతో పాటు శ్మశానవాటికలు కబ్జాకు గురికాకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలోనే రెండు శ్మశానవాటికలలో సర్వే చేపడుతామన్నారు. బీజేపీ నాయకులు కొడీ సురేందర్, వెంకటేష్, సురేష్, దేవేందర్, బాలు పాల్గొన్నారు.

గంజాయి సేవిస్తున్న ఐదుగురి అరెస్ట్

మాదాపూర్: గంజాయి సేవిస్తున్న ఐదుగురిని మాదాపూర్ పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన మేరకు.. మాదాపూర్ చందానాయక్ తండాలోని జిఆర్‌సీ రెసిడెన్సి అపార్ట్‌మెంట్‌లో గంజాయి సేవిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు గురువారం అపార్ట్‌మెంట్‌లోని పెంట్ హౌస్‌లో ఉన్న వారిని తనిఖీ చేయగా వెంకటేష్, విజయరెడ్డి, రాహుల్, శివకుమార్‌లతో పాటు మరో యువతి ప్రియాంకను అదుపులోకి తీసుకున్నారు. యూరిన్, దగ్గు స్క్రీన్ పరీక్షలు నిర్వహించగా వారు గంజాయి సేవించినట్టు తెలింది. వీరికి మత్తు పదార్థాలు విక్రయించిన వ్యక్తి ఇంటియజమాని రామచంద్రారెడ్డిగా పోలీసులు అనుమానిస్తున్నారు.

చిన్నారుల ఎదుగుదలకు 'బాలామృతం'..

- తప్పనిసరిగా తినిపించాలంటున్న అంగన్‌వాడీ టీచర్లు..
- ఎన్నో ప్రయోజనాలతో కూడిన ఆహారం
- పోషక విలువలు మెండు



తల్లులకు బాలామృతం ప్యాకెట్లు అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్

బంజారాహిల్స్: చిన్నారుల్లో బలహీనత, రక్తహీనత, పోషణ లోపాల నివారణకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలామృతం పంపిణీ చేస్తోంది. బలవర్ధకమైన ఈ ఆహారంపై క్షేత్ర స్థాయిలో అవగాహన లేక చాలామంది తల్లిదండ్రులు పోషకాలతో నిండి ఉన్న బాలామృతాన్ని పిల్లలకు తినిపించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. పిల్లల్లో పోషణ లోపం పోవాలన్నా, రక్తహీనత నివారణకు బాలామృతాన్ని ప్రతిరోజూ తినిపించాలని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు సూచిస్తున్నారు. అంగన్‌వాడీ టీచర్లు సైతం తప్పనిసరిగా తమ పరిధిలోని పిల్లలకు నెలకో సంచి చొప్పున బాలామృతాన్ని అందజేస్తున్నారు. ఖైరతాబాద్ ఐసీడీఎస్ పరిధి కిందికి వచ్చే సోమాజిగూడ, ఖైరతాబాద్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వర కాలనీ, షేక్‌పేట, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, బోరబండ, ఎర్రగడ్డ, వెంగళరావునగర్, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్ల పరిధిలోని 151 అంగన్‌వాడీ కేంద్రాల్లో 16,156 మంది పిల్లలు ఆటాపాటలతో కూడిన విద్యా బోధన అందిస్తున్నారు. వీరికి పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నారు. ఆరు నెలల నుంచి ఆరేళ్ల లోపు పిల్లలకు ఆటపాటలతో కూడిన బోధనతో పాటు తప్పనిసరిగా బాలామృతాన్ని అందించేందుకు ప్రణాళికలు రూపొందించుకుని పటిష్టంగా అమలు చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఎదుగుదలకు, మానసిక వికాసానికి, జ్ఞాపకశక్తి పెరుగుదలకు బాలామృతం దోహదపడుతుందని అంగన్‌వాడీ టీచర్లు పేర్కొంటున్నారు. కొద్ది రోజుల క్రితం ఐసీడీఎస్ ఖైరతాబాద్ జోన్ పరిధిలో నిర్వహించిన సర్వేలో 1450 మంది చిన్నారుల్లో తీవ్ర, అతి తీవ్ర పోషణ లోపం ఉన్నట్లుగా గుర్తించి వారికి బాలామృతం ప్లస్ అందిస్తున్నారు. ఇది క్రమం తప్పకుండా తినిపించడం వల్ల ఆరు నెలల్లోనే గణనీయమైన మార్పు కనిపిస్తుండడంతో చాలామంది తల్లిదండ్రులు దీని వైపు మొగ్గుచూపుతున్నారు.

బాలామృతంలో ఉండే పోషక పదార్థాలు ఇవీ..

బాలామృతం ప్లస్‌లో వేయించిన గోధుమలు, శెనగపప్పు, పాల పొడి, పల్లీలు, అటుకులు, పంచదార, నూనెతో పాటు క్యాల్షియం, ఐరన్, విటమిన్-ఏ, బీ1, బీ2, బీ12, సీ, ఫోలిక్ యాసిడ్, నియాసిన్, జింక్, మాంసకృత్తులు ఉంటాయి. వీటన్నింటి సమ్మేళనమే బాలామృతం.

ప్రయోజనాలు ఇవీ..

పిల్లలకు బాలామృతం తినిపించడం వల్ల శారీరక, మానసిక ఎదుగుదలతో పాటు రోగ నిరోధక శక్తి, ఆకలిని పెంచుతుంది. రక్తహీనత, బలహీనతను తగ్గిస్తోంది. పిల్లలు ఆరోగ్యంగా ఉండేందుకు తోడ్పడుతుంది. బాలామృతం పిల్లల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. తీవ్ర, అతి తీవ్ర పోషణ లోపం ఉన్న చిన్నారులకు బాలామృతం ప్లస్‌ను తప్పక తినిపించాలి.

రోజుకు 100 గ్రాముల పంపిణీ



అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు ప్రతి నెలా రెండున్నర కిలోల బాలామృతం ప్యాకెట్‌ను అందజేస్తుంటాం. ప్రతిరోజూ 100 గ్రాముల బాలామృతాన్ని తల్లులు చిన్నారులకు తినిపించాలి. బాలామృతం తినడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. మా వద్దకు 70 మంది చిన్నారులు వస్తుంటారు. వీరందరికీ బాలామృతం పంపిణీ చేయడమే కాకుండా తల్లులు రోజూ తినిపిస్తున్నారో లేదోనని ఆరా తీస్తుంటాం. తప్పనిసరిగా తినిపించాలని ఎప్పటికప్పుడు సూచిస్తుంటాం. పిల్లలు ఎదగాలంటే ఎన్నో పోషకాలు ఉన్న ఈ ఆహారాన్ని తినిపించాలి. చాలామంది తల్లులు తమ పిల్లలకు దీనిని తినిపిస్తున్నారు. తద్వారా పిల్లల మానసిక ఎదుగుదల కూడా స్పష్టంగా కనిపిస్తోంది.

– శివమ్మ, అంగన్‌వాడీ టీచర్, జ్ఞానీజైల్‌సింగ్‌నగర్, ఫిలింనగర్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మణికొండ: విద్యుత్ మరమ్మతు పనుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని నార్సింగి ఏఈ మణికంఠ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 11.30 వరకు రాందేవ్‌గూడ, వన్‌మోర్‌నగర్, నెక్నాంపూర్ గ్రామం, ఫెయిర్ ఫీల్డ్ కాలనీ, ఈవీవీ కాలనీ, పాయనీర్ ఎస్టేట్, వైఎస్సార్ కాలనీ, పాషాకాలనీ, అలిజాపూర్, వెంకటేశ్వర కాలనీల్లో విద్యుత్ ఉండదన్నారు.

నేడు ఫుడ్ ఫెస్టివల్

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల(రాజేంద్రనగర్)లో శుక్రవారం ఫుడ్‌ఫెస్టివల్‌ను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందు ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు సొంతంగా తయారు చేసిన ఆహార పదార్థాలను ప్రదర్శించనున్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

మైలార్‌దేవ్‌పల్లి: ఆస్పత్రుల యాజమాన్యాలు మెరుగైన వైద్య సేవలందించాలని రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి సూచించారు. దుర్గానగర్ నూతనంగా ఏర్పాటు చేసిన టీఆర్‌జీ ఆస్పత్రిని గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. పేద ప్రజలకు తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్య సేవలందించాలన్న ఉద్దేశంతో ఆసుపత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ కదిచర్ల భీమ్‌రెడ్డి, డాక్టర్ గద్దె సారీష్, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు నోముల రాముయాదవ్, అక్కెం రఘుయాదవ్, వెంకటేష్ కురుమ, గుమ్మడి కుమార్, మైసిరెడ్డి, భాస్కర్ నేత, అరుణ్‌ముదిరాజ్, సురేష్‌ముదిరాజ్, రాజేష్‌యాదవ్ పాల్గొన్నారు.

నార్సింగి మున్సిపల్ ప్రత్యేకాధికారిగా శ్రీనివాస్‌రెడ్డి



శ్రీనివాస్ రెడ్డితో కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీకి ప్రత్యేకాధికారిగా సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి నియామకమయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు మున్సిపల్ కమిషనర్ టి. కృష్ణమోహన్‌రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం ఆయన కృష్ణమోహన్‌రెడ్డి, డీఈ నరేష్‌కుమార్, ఏఈ శ్రీనివాస్, మేనేజర్ నాగేంద్రబాబుతో కలిసి మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి చేసిన పార్కులు, జంక్షన్లు, రోడ్ల అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మాధవోని కుంటను పరిశీలించిన హైడ్రా అధికారులు

శంషాబాద్: విమానాశ్రయానికి ఆనుకుని ఉన్న మాధవోని కుంటను గురువారం హైడ్రా అధికారులు పరిశీలించారు. వార్డు నంబరు 9 గొల్లపల్లి పరిధిలోని సర్వే నంబరు 185లో 16 ఎకరాల 20 గుంటల విస్తీర్ణంలో మాధవోని కుంట ఉండేది. విమానాశ్రయం ఏర్పాటులో సగభాగం విస్తీర్ణం కోల్పోయింది. మిగతా సగభాగంలో ఉన్న స్థలాన్ని వారం రోజులుగా కొందరు వ్యక్తులు మట్టితో నింపి చదును చేస్తున్నారు. విషయం తెలుసుకున్న హైడ్రా సీఐతో ఇరిగేషన్ అధికారులు సంబంధిత స్థలాన్ని పరిశీలించారు. కుంట ఆక్రమణకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు



రాజేంద్రనగర్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్ర గాయాలకు గురైన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..బండ్లగూడ అభ్యుదయనగర్ కాలనీకి చెందిన సాయి (25) రాక్ చర్చి ప్రాంతంలోని విల్లాలలో పని చేస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం తన ద్విచక్ర వాహనంపై 60 గజాల కాలనీకి వెళ్తుండగా రోడ్డుపై మట్టి దిబ్బలు ఉండటంతో వాహనం అదుపుతప్పి పక్క నుంచి వెళ్తున్న డీసీఎం వెనుక చక్రాల కింద పడ్డాడు. ఈ సంఘటనలో రెండు చేతులపై నుంచి డీసీఎం వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

ప్రతి 50 నిమిషాలకు ఓ బస్సు

మియాపూర్: లింగంపల్లి నుండి ఆర్‌జీఐ ఎయిర్ పోర్టుకు ప్రతి 50 నిమిషాలకు ఏసీ పుష్పక్ బస్సులు నడుపుతున్నట్లు మియాపూర్ -2 డిపో మేనేజర్ వెంకటేశం తెలిపారు. మొదటి బస్సు ఉదయం 5.45 గంటలకు, చివరి బస్సు రాత్రి 8.45 గంటలకు ఉంటుందన్నారు. ఎయిర్ పోర్టు నుండి లింగంపల్లికి మొదటి బస్సు ఉదయం 7.30 గంటలకు, చివరి బస్సు రాత్రి 10.30 గంటలకు ఉంటుందన్నారు.